సాక్షి ప్రకాశం
గురువారం । 24 । అక్టోబర్ । 2024



దళితుల భూములపై పచ్చగద్దలు
పొన్నలూరు మండలం ఉప్పలదిన్నెలో దళితుల భూములు కాజేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. భూహక్కు పత్రాలు చూపినా అధికారులు పట్టించుకోవడం లేదు. - 8లో..



సాగర్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య
చీటీపాటల విషయంలో భార్యతో గొడవపడి సాగర్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దర్శిలో బుధవారం జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా మోపిదేవి



నూతన కమిటీని అభినందిస్తున్న నర్సింగ్ సిబ్బంది

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా మోపిదేవి ఉదయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జీజీహెచ్‌లోని లెక్చర్ గ్యాలరీలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా కో ఆపరేటివ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీసీ మాలకొండయ్య వ్యవహరించారు. జిల్లాలోని 324 మంది సభ్యులు ఈ ఎన్నికల్లో పాల్గొని కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా కె.సుజాత, కార్యదర్శిగా కొత్తపల్లి మంజేష్, కోశాధికారిగా మండవ సుజాతలతో పాటుగా ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి.నాగరాజా కుమారి, బి.వి.రామలక్ష్మి, యం.మహేష్, షేక్ జానీబాషా, ఎస్‌కె మహబూబ్ బీబీ ఎన్నికయ్యారు.

31 లోపు దరఖాస్తులు అందజేయాలి

ఒంగోలు సిటీ: ఒంగోలు డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్‌గా పనిచేసేందుకు అర్హత కలిగిన జిల్లా ప్రభుత్వ/జిల్లా పరిషత్/ మునిసిపల్ యాజమాన్యంలో పనిచేసేందుకు ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ నెల 31 వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు వారి సర్వీస్ వివరాలతో పాటుగా టెక్నికల్ సర్టిఫికేట్‌ను జతపరచి సంబంధిత ప్రధానోపాధ్యాయులు/మండల, జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా జిల్లా కార్యాలయానికి ఈ నెల 31వ తేదీ లోపల అందజేయాలని డీఈఓ కోరారు. ఎస్జీటీ తోపాటు కంప్యూటర్ అనుభవం కలిగి ఉండి, పీజీడీసీఏ కోర్సు చేసి ఉండాలన్నారు.

ప్రభుత్వం నుంచి రాగానే నష్టపరిహారం ఇస్తాం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే రైతుల ఖాతాల్లో జమవుతాయని మార్కాపురం వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. బుధవారం సాక్షిలో ×సేద్యం గగనం॰ శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని చెప్పిందని, ఇంకా ఉత్తర్వులు విడుదల కాలేదని చెప్పారు. కరువు, భారీ వర్షాల వలన నష్టపోయిన రైతుల జాబితాను ఎప్పటికప్పుడు తయారుచేసి నివేదికలను అధికారులకు పంపుతున్నామని అన్నారు. ఈ పథకాలకు, నష్టపరిహారం సంబంధించిన నిధులు ప్రభుత్వ పరిధిలో ఉన్నందున ఈ విషయాలను అధికారులకు తెలిపి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్వపు డీపీవోపై విచారణ పూర్తి

- బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు
- కలెక్టర్ కు నివేదిక అందజేసిన త్రిసభ్య కమిటీ

ఒంగోలు అర్బన్: జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్ 5, 6 సెక్రటరీల (సచివాలయ ఉద్యోగుల) సాధారణ బదిలీల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు చైర్మన్‌గా మరో ఇద్దరు అధికారులతో త్రిసభ్య కమిటీ వేసి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం విచారణ పూర్తి చేసిన త్రిసభ్య కమిటీ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. సాధారణ బదిలీల్లో నిబంధనలకు విరుద్ధంగా పూర్వపు డీపీవో, పలువురు ఉద్యోగులు అవినీతికి పాల్పడి బదిలీలు నిర్వహించినట్లు ఫిర్యాదు వచ్చాయి. ఇప్పటికే డీపీవో కార్యాలయం ఏవోతో పాటు మరో జూనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పూర్వపు డీపీవో ఉషారాణితో పాటు సచివాలయ ఉద్యోగులను త్రిసభ్య కమిటీ క్షుణ్ణంగా విచారించింది. విచారణలో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి డబ్బును ఆన్‌లైన్ పేమెంట్ విధానంలో ఇచ్చినట్లు విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా డీపీవో కార్యాలయం ఉద్యోగులు డీపీవో చెప్పినట్లు చేశామని తెలిపినట్లు సమాచారం. బ్యాంకు లావాదేవీలను కమిటీ పరిశీలించింది. మొత్తం మీద విచారణ పూర్తి చేసిన త్రిసభ్య కమిటీ నివేదిక కలెక్టర్ చేతికి వెళ్లింది. నివేదిక ఆధారంగా ఏ చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

గుడి.. బడి.. ఎక్కడైనా తాగిస్తాం!

మద్యం దుకాణాల ఏర్పాటు నుంచే ఉల్లంఘనలు మొదలైపోయాయి. ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం మద్యం పాలసీని తీసుకొస్తే.. ఇక దుకాణాలు దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు మరో అడుగు ముందుకేశారు. గుడి, బడి, నివాస సముదాయాలు, ఆస్పత్రులు, హైవేలు ఇవేమీ మాకు పట్టవు.. నిబంధనలు జాన్తానై అంటున్నారు. ప్రజల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎక్కడపడితే అక్కడ దుకాణాలు వెలుస్తుంటే అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పెద్దల అండదండలతోనే ఇదంతా జరుగుతోందన్న చర్చ బలంగా సాగుతోంది.

- ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలు
- నిబంధనలు బేఖాతరు చేస్తున్న మద్యం వ్యాపారులు
- దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వైద్యశాలల సమీపంలోనే మద్యం దుకాణాలు
- ప్రజలు వ్యతిరేకిస్తున్నా లెక్క చేయని వ్యాపారులు
- మహిళలు, విద్యార్థుల అభ్యంతరాలు పట్టని అధికారులు
- అధికార పార్టీ పెద్ద అండదండలతోనే ఉల్లంఘనలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభించి వారం కావస్తోంది. అప్పుడే జిల్లా వాసుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తవుతున్నాయి. ఆదాయవనరుగా కూటమి ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రారంభించింది. జిల్లాలో 38 మండలాల్లో 171 మద్యం దుకాణాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఒక్కో దరఖాస్తుకు గాను రూ.2 లక్షల చొప్పున కోట్లాది రూపాయలు వసూలు చేసిన ప్రభుత్వం వారికి అనుకూలంగా మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంది. దాదాపుగా దుకాణాలన్నిటినీ చేజిక్కించుకున్న తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు మద్యం దుకాణాల ఏర్పాటులో ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేశారు. నిబంధనల ప్రకారం దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు, వైద్యశాలలకు దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అవేవీ పట్టకుండా అంతా మా ఇష్టం అనేలా వ్యవహరిస్తున్నారు. నివాస గృహాల మధ్యలో కూడా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను తొలగించాలని మహిళలు, మహిళా సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. స్థానిక అధికారులు వినడం లేదని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా చెవికెక్కడం లేదు.



పామూరులో సత్యనారాయణస్వామి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

పాఠశాలలను లెక్కచేయకుండా...

పాఠశాలలో చిన్నారులు చదువుకుంటుంటారు. కనీస ఇంగితం కూడా లేకుండా వాటికి సమీపంలోనే మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంతో తల్లిదండ్రులు భగ్గుమంటున్నారు. యర్రగొండపాలెంలోని కొలుకుల రోడ్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. అక్కడే ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల కూడా ఉంది. ఈ పాఠశాలల ఆవరణలో పసిపిల్లల కోసం ఏర్పాటు చేసిన అంగన్ వాడీ కేంద్రం ఉంది. అయితేనేం అంటూ పాఠశాలలకు సమీపంలోనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఉప్పుగుండూరు గంగమ్మ సెంటర్లోని మద్యం బెల్ట్‌షాపు సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉంది. ఒంగోలులోని కర్నూలు హైవే ఎంట్రన్స్‌లో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. మార్కాపురం, చీమకుర్తి, సంతనూతలపాడు, త్రోవగుంట, మద్దిపాడు, నాగులుప్పలపాడు, అద్దంకి తదితర ప్రాంతాల నుంచి వివిధ కాలేజీల్లో చదువుకునేందుకు విద్యార్థులు ఒంగోలుకు వస్తుంటారు. వారిలో అత్యధికులు ఇక్కడే బస్సుదిగి కాలేజీలకు వెళుతుంటారు. సరిగ్గా ఈ బస్ పాయింట్ వద్దనే మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. ఈ మద్యం దుకాణానికి పక్కనే మెడికల్ షాపు కూడా ఉంది. ఇక్కడకు మందుల కోసం మహిళలు, వృద్ధులు వస్తుంటారు. అయితేనేం అంటున్నారు మద్యం వ్యాపారులు. కొండపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం కే బిట్రగుంట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి పక్కన మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ఇక్కడ లారీలు, కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు మద్యం తాగేందుకు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.



జాతీయ రహదారికి 15 మీటర్ల దూరంలో జరుగుమల్లి మండలం కే బిట్రగుంట వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపు

అభ్యంతరాలను పట్టించుకునేదెవరు...

మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యతిరేకంగా జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలు, మహిళలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఒకటికి రెండు సార్లు విజ్ఞప్తులు చేసినా లెక్క చేయడంలేదు. దాంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు మండల కేంద్రం బీసీ కాలనీలో నివాస గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక మహిళలు ధర్నాకు దిగారు. మహిళలు పెద్ద సంఖ్యలో రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేసినా అధికారులకు పట్టలేదు. గ్రోత్ సెంటర్ చర్చి సమీపంలో మద్యం దుకాణం తొలగించాలని స్థానికులు చెప్పినా వినేవారు లేకపోయే సరికి నాగులప్పలపాడు మార్గంలో వెళ్లే వాహనాలను నిలిపివేసి నిరసన తెలిపారు. సంతనూతలపాడు పెద్ద బజారులో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే చోటకు మార్చాలని కోరుతూ మహిళలు, విద్యార్థులు రెండు రోజుల పాటు నిరసనలు తెలిపారు. కనిగిరి పట్టణంలోని డిపో డౌనులో కేసీరెడ్డి నగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ఎదుట ప్రజలు నిరసనకు దిగి ధర్నా చేపట్టారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోవడంతో ఏకంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మోహిద్దీన్‌లను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అయినా దుకాణం కొనసాగుతుండడం గమనార్హం. జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ అధికార పార్టీకి చెందినవి కావడంతో అధికారులు తగిన చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో మద్యం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇక ప్రజాప్రతినిధుల సహకారంతో బదిలీలు చేయించుకున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు వారికి ఎలాంటి కష్టం, నష్టం కలగకుండా వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

నిబంధనల మార్పుతో..

గతంలో మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడే ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో స్పష్టంగా తెలియజేయాలి. లైసెన్స్ లభించిన తరువాత దరఖాస్తు ఇచ్చిన చిరునామా ప్రకారమే ఏర్పాటు చేయాలి. అందుకు భిన్నంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకునేవారు. అవసరమైతే లైసెన్సు రద్దు చేసేవారు. కానీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఆ నిబంధనలను పూర్తిగా మార్చేసింది. దరఖాస్తులో దుకాణం ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి షరతులు విధించలేదు. పైగా మండలాన్ని యూనిట్‌గా చేసుకొని మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతులిచ్చింది. దీని ప్రకారం లైసెన్సుదారుడు తన ఇష్టం వచ్చిన చోట మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకుని మద్యం వ్యాపారులు బరితెగించారు.

దేవాలయాలు, మసీదులు, చర్చిల సమీపంలోనే...

జిల్లాలో మద్యం వ్యాపారులు బరితెగిస్తున్నారు. మమ్మల్ని ఎవర్రా ఆపేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సున్నితమైన ప్రదేశాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి సమస్యలకు కారణమౌతున్నారు. జిల్లాలో అనేక గ్రామాలు, పట్టణాల్లో ప్రార్థనా స్థలాలకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామం గంగమ్మ సెంటర్లో మద్యం దుకాణం ఏర్పాటుపై గ్రామస్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దుకాణానికి సమీపంలోనే అంకమ్మ తల్లి, మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ తల్లి దేవాలయాలున్నాయి. ఇక్కడకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఒంగోలులోని అద్దంకి బస్టాండు సెంటర్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి సమీపంలో మసీదు ఉంది. అలాగే ఈ దారికి ఇంకాస్త ముందుకు వెళితే బాలికోన్నత పాఠశాల వస్తుంది. ఈ దారిగుండా బాలికలు పాఠశాలకు వచ్చిపోతుంటారు. మద్దిపాడు మండలంలోని గ్రోత్ సెంటర్లో చర్చి ఉంది. ఇక్కడకు మద్దిపాడు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా గ్రోత్ సెంటర్లో పనిచేసే చిరుద్యోగులు, కార్మికులు ప్రార్థనలకు వస్తుంటారు. ఇక్కడ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ప్రజలు నిరసిస్తున్నారు. అలాగే పామూరులోని సత్యనారాయణస్వామి ఆలయం పక్కన నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటుపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఆలయానికి సమీపంలోని మద్యం దుకాణాన్ని తొలగింది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయానికి పక్కనే మళ్లీ దుకాణం ప్రత్యక్షమైంది. ఆలయం పక్కన దుకాణం ఏర్పాటుకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రజలు నిలదీస్తున్నారు.

అంతా మా ఇష్టం!

- నిబంధనలకు విరుద్ధంగా వీవోఏల తొలగింపు
- స్వామి భక్తి చూపించిన ఏపీఎం
- విధుల్లోకి తీసుకోవాలంటూ కోర్టు మెట్లెక్కిన వీవోఏలు
- విధుల్లో చేర్చుకోవాలని హైకోర్టు ఆదేశాలు
- మీనమేషాలు లెక్కిస్తున్న ఐకేపీ అధికారులు

జరుగుమల్లి (సింగరాయకొండ): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో చివరకు మహిళలకే అన్యాయం జరుగుతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు న్యాయం కావాలంటూ అన్యాయానికి గురైన వీవోఏలు కోర్టు మెట్లెక్కితే వెంటనే స్పందించిన హైకోర్టు వీరిని విధుల్లో నుంచి ఎందుకు తొలగించారని డీఆర్‌డీఏ అధికారులను వివరణ కోరింది. వీరిని తొలగించలేదని విధుల్లోనే ఉన్నారని అధికారులు కోర్టును తప్పుదోవ పట్టించారు. వీవోఏలు మేము విధుల్లో ఉన్నామని చెప్పారు కదా విధుల్లోకి తీసుకోవాలని కోరితే గత 15 రోజుల నుంచి చూద్దాం చేద్దాం అంటూ కాలయాపన చేస్తున్నారని జరుగుమల్లి పంచాయతీకి చెందిన జయలక్ష్మి గ్రూపు వీవోఏ కొండూరు జీవనజ్యోతి, చింతలపాలెం పంచాయతీకి చెందిన నాగలక్ష్మి గ్రూపు వీవోఏ కోనూరి రాములమ్మ, స్త్రీనిధి గ్రూపు వీవోఏ నలమాల శ్యామల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముగ్గురు వీవోఏలు చెప్పిన వివరాల ప్రకారం కొండూరు జీవనజ్యోతి, కోనూరి రాములమ్మ 17 సంవత్సరాలుగా, నలమల శ్యామల 3 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు గ్రూపు సభ్యులతో చేదోడు వాదోడుగా ఉంటూ రాజకీయపార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూరుస్తూ తీసుకున్న రుణాలను సకాలంలో కట్టించి ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా తమ విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ ముగ్గురి గ్రూపులు 'ఏ' గ్రేడ్‌లో ఉన్నాయి. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు ఈ ముగ్గురిని తొలగించి తాము చెప్పిన వారిని విధుల్లోకి తీసుకోవాలని ఐకేపీ అధికారులను ఆదేశించారు.



డీఆర్‌డీఏ పీడీని కలిసి హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరిన వీవోఏలు

నిబంధనలకు విరుద్ధంగా వీవోఏల తొలగింపు:

టీడీపీ నాయకుల ఆదేశాలను శిరసా వహించిన అప్పటి ఏపీఎం, సీసీలు జీ హుజూర్ అంటూ వీరిని ఆగస్టు 30 వ తేదీ కార్యాలయానికి పిలిపించి సెప్టెంబరు 1వ తేదీ నుంచి మిమ్మల్ని విధుల్లో నుంచి తొలగించి కొత్తవారిని తీసుకుంటున్నాం.. మీ వద్ద ఉన్న రికార్డులు వెంటనే కార్యాలయానికి అప్పగించాలని ఆదేశించి వీరి పేర్లను ఆన్‌లైన్‌లో, వాట్సప్ గ్రూపుల్లో తొలగించారు. వాస్తవానికి వీరిని తొలగించే అధికారం ఏపీఎంకు గానీ, డీఆర్‌డీఏ పీడీ స్థాయి అధికారికి గానీ లేదు. వీరిని తొలగించే అధికారం గ్రూపు సభ్యుల తీర్మానం ద్వారా మాత్రమే ఉంది. ప్రతి వీవోఏ పరిధిలో గ్రూపుల సమావేశం నిర్వహించి మెజార్టీ సభ్యులు వీవోఏను తొలగించాలని తీర్మానం చేయాలి. తరువాత ఈ తీర్మానాన్ని వీవోఏల మీటింగ్ లో సీసీ ప్రవేశపెడుతుంది. తరువాత ఏపీఎం 30 రోజుల్లో వీరికి రెండు నోటీసులు జారీ చేసి వీరి నుంచి వివరణ తీసుకుని అప్పుడు మాత్రమే తొలగించాలి. కానీ ఇవేమీ చేయకుండా టీడీపీ నాయకులు చెప్పారని స్వామి భక్తితో మమ్మల్ని విధుల నుంచి తొలగించి ఇతరులను విధుల్లో చేర్చుకున్నారని సదరు వీవోఏలు ఆరోపిస్తున్నారు. తమను విధుల్లోకి తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. తమను అన్యాయంగా విధుల్లో నుంచి తొలగించడంలో అప్పటి ఏపీఎం, సీసీల పాత్ర ప్రధానంగా ఉందని, వీరి అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమను విధుల్లోకి తీసుకుని హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని బుధవారం డీఆర్‌డీఏ పీడీ టీ వసుంధర, ఏపీఎం డీ జయరాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేసి హైకోర్టు ఆర్డరును అందజేసామని తెలిపారు. దీనిపై ఏపీఎం జయరాజ్‌ను వివరణ కోరగా ముగ్గురు వీవోఏలను విధుల్లో నుంచి తొలగించలేదని, అలాగని విధుల్లోనూ లేరని, వీరి స్థానంలో వేరే వారున్నారన్నారు. జిల్లా అధికారుల సూచనల ప్రకారం హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తామని చెప్పారు.

రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

ఒంగోలు సబర్బన్: వివిధ రకాల రుణాలు, కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఒంగోలు రీజినల్ మేనేజర్ కార్యాలయం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా రీజినల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు, ఆర్‌ఏసీపీసీ ఏజీఎం పీ.టి.వెంకట్రావుల నేతృత్వంలో నగరంలోని రంగారాయుడు చెరువు కట్టపై ఉన్న వాకింగ్ ట్రాక్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వివిధ ఎస్.బి.ఐ.శాఖలకు చెందిన సిబ్బందితో కలిసి ఎస్‌బీఐ ఆర్ఎం, ఆర్‌ఏసీపీసీలతో కలిసి అనంతరం ప్రధాన రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బీఐ బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్న వివిధ రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం ఎస్.గున్నేశ్వరరావు మాట్లాడుతూ గృహ రుణాలపై అందిస్తున్న ప్రత్యేక రాయితీలు, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా అందజేస్తున్న రుణాల గురించి వివరించారు. ఆర్.ఏ.సి.పి.సి., ఏజీఎం పి.టి.వెంకట్రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద వచ్చే మార్గదర్శకాల మేరకు రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్ బాబు, పి.వీరయ్య, నాగేశ్వరరావు, కె.రామారావు, ఒంగోలు ఆర్ఎం సీఏ ఆర్‌బీఓ సీహెచ్ శ్రీనివాస రావు, హెచ్‌ఆర్ మేనేజర్ ఆర్‌బీఓ నళినీకాంత్, ఆఫీసర్స్ సెక్రటరీ సీహెచ్ శ్రీనివాసులు, బ్రాంచి మేనేజర్లు నిర్మల కుమారి, కిషోర్, హేమకేసర్, దీప్తి, కె.జానకి రామయ్య, వి.శ్రీనివాసరావు, పి.బి.చంద్రశేఖర్, ఎం.సూరజ్, శ్రీధర్, కోటేష్ బాబు పాల్గొన్నారు.

ఆటలు మానసికోల్లాసానికి దోహదం





ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: ఆటలు మానసికోల్లాసాన్ని, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని ఏకేయూ వీసీ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. స్థానిక ఏకేయూ ఆవరణలో బుధవారం నిర్వహించిన అంతర కళాశాలల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు ఆసక్తి కనబరచాలన్నారు. ఉన్నత స్థాయి చదువుల్లో క్రీడా కోటా కింద అడ్మిషన్లు లభిస్తాయని చెప్పారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఉపయోగపడతాయని ఏకేయూ ప్రిన్సిపాల్ రాజమోహన్ అభిప్రాయపడ్డారు. వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా ఐకమత్యం, క్రీడా స్ఫూర్తి అలవడుతుందని చెప్పారు. పోటీల్లో తొలిరోజైన బుధవారం తైక్వాండో (మెన్, ఉమెన్), ఫెన్సింగ్ (మెన్, ఉమెన్) పోటీలు నిర్వహించారు. పోటీలను సీడీసీ డీన్ సోమశేఖర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాదవ్, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు నవంబరు 6వ తేదీనుంచి 9వ తేదీ వరకు అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్శిటీ (తైక్వాండో), జమ్మూలోని యూనివర్శిటీ ఆఫ్ జమ్మూలో (ఫెన్సింగ్) అంతర్ యూనివర్శిటీల పోటీల్లో ఏకేయూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

విజేతల వివరాలు:

తైక్వాండో మెన్: 54 కేజీల విభాగంలో జి.భాస్కర్, 63 కిలోల విభాగంలో ఎం.రంజిత్

తైక్వాండో ఉమెన్: 57 కేజీల విభాగంలో కె.గిరిజారెడ్డి, 62 కేజీల విభాగంలో ఎం.శైలజ

ఫెన్సింగ్ మెన్: కె.నవీన్‌కుమార్‌రెడ్డి

ఫెన్సింగ్ ఉమెన్: ఆర్.విజయలక్ష్మి

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయండి

ఒంగోలు సిటీ: వచ్చే నెల 5వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తికి బుధవారం విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి ప్రకాశం జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా విద్యా సంస్థలకు ఎక్కువగా సెలవులు రావడంతో యూనివర్శిటీ పరిధిలో ఉండే కళాశాలలో సిలబస్ పూర్తి కాలేదన్నారు. అలాగే గత నెల మొత్తం దసరా, వినాయకచవితి పండుగలు నేపథ్యంలో కళాశాలలకు సెలవులు వచ్చాయన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్యామ్, నాయకులు బాలాజీ, సతీష్, కోటి తదితరులు పాల్గొన్నారు.



వైస్ ఛాన్సలర్‌కి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

క్లుప్తంగా

జైళ్ల నిర్వహణపై మరింత శ్రద్ధ వహించాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జైళ్ల ఉప శాఖాధికారి వరప్రసాద్

ఒంగోలు టౌన్: జైళ్ల నిర్వహణపై అధికారులు మరింత శ్రద్ధచూపాలని గుంటూరు రేంజ్ జైళ్ల ఉప శాఖాధికారి ఎం. వరప్రసాద్ అన్నారు. జిల్లా కారాగారాన్ని బుధవారం ఆయన సందర్శించారు. జిల్లా జైలు సూపరెండెంట్ పి. వరుణారెడ్డి ఆయన్ను సాదారంగా ఆహ్వానించారు. జైళ్ల నిర్వహణతో పాటుగా భద్రతపై చర్చించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, కృష్ణ, ఏలూరు జిల్లాలకు చెందిన జైలు అధికారులు పాల్గొన్నారు.

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ లారీని పట్టుకున్న సబ్‌కలెక్టర్, రెవెన్యూ అధికారులు

కంభం: లారీలో అక్రమంగా తరలిస్తున్న 600 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం అర్ధరాత్రి మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట నాగ త్రినాథ్ పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..యర్రగొండపాలెం మండలం ఆమనిగుడిపాడు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న మార్కాపురం సబ్ కలెక్టర్ రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి అర్ధరాత్రి కందులాపురం కూడలిలో హైవే రోడ్డుపై లారీని అడ్డగించారు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలో సుమారు 3 టన్నులకు పైగా రేషన్‌బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

దళితుల భూములపై పచ్చ గద్దలు..!

అధికారం అండగా తెలుగు తమ్ముళ్లు పెట్రేగిపోతున్నారు. తాము ఏం చేసినా చెల్లుబాటవుతుందన్న భావనలో రెండున్నర దశాబ్దాల క్రితం దళితులకు ఇచ్చిన భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. ఆ కుట్రకు మంత్రి స్వామి అధికార దర్పం తోడవడంతో రెవెన్యూ యంత్రాంగం నిబంధనలనకు నీళ్లొదిలి దళితులను భూముల్లోని వెళ్లగొట్టేందుకు బెదిరింపులకు దిగుతున్నారు. పాతికేళ్లుగా ఆ భూమినే నమ్ముకున్న తమకు దిక్కెవరంటూ దళితులు వాపోతున్నారు.

- ఉప్పలదిన్నెలో దళితుల భూములు కాజేసేందుకు పచ్చనేతల ప్రయత్నం
- 1991లో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా 22 మంది దళితులకు భూమి పంపిణీ
- ఆ భూమిని 25 ఏళ్లగా సాగు చేసుకుంటున్న దళితులు
- దళితులను భూమిలోకి పోకుండా చేయాలని రెవెన్యూ అధికారులకు మంత్రి స్వామి హుకుం
- పొలాలు సాగు చేయవద్దని గ్రామంలో దండోరా
- భూ హక్కు పత్రాలు చూపించినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- టీడీపీ కార్యకర్తలు సాగు చేస్తున్న ప్రభుత్వ భూమి జోలికి వెళ్లని అధికారులు



ఉప్పలదిన్నెలో దళితులకు పంపిణీ చేసిన సర్వే నంబర్-1 లోని ప్రభుత్వ భూమి

పొన్నలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో తెలుగు తమ్ముళ్ల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారుల కూడా అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తూ మంచి చెడు లేకుండా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆఖరికి ఎస్సీ రిజర్వుడైన కొండపి నియోజకవర్గంలో మంతి స్వామి ఇలాకాలో కూడా దళితులపై గతంలో ఎన్నడూ లేని విధంగా అనేక అరాచకాలు జరుతున్నాయి. వివరాల్లోకి వెళితే..పొన్నలూరు మండలం ఉప్పలదిన్నె గ్రామంలో 25 ఏళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై స్థానిక టీడీపీ నేతల కన్ను పడింది. అధికారులను అడ్డుపెట్టుకొని కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి వెళ్లవద్దంటూ గ్రామంలో దండోరా వేయించారు.

ఆ భూములను కాజేసేందుకే..

ఉప్పలదిన్నె గ్రామం సర్వే నంబర్-1లో సుమారుగా 225 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి గ్రామానికి సమీపంలో ఉండి సాగుకు అనుకూలంగా ఉండటంతో గ్రామంలోని నిరుపేదలైన ఎస్సీ, బీసీలు భూమిని తమకు మంజూరు చేస్తే పంటలు సాగు చేసుకొని జీవనం సాగిస్తామని అధికారులకు అర్జీలు సమర్పించారు. దీంతో అప్పటి తహసీల్దార్ ఇస్మాయిల్ స్పందించి 1973 ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణ చట్టం ప్రకారం దళితులకు భూమి పంపిణీ చేయవచ్చని 1991 ఫిబ్రవరి నెలలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎస్సీ, బీసీలు 59 మంది అర్జీలు సమర్పించగా మొదటి విడతగా అర్హులైన 22 మంది దళితులకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అదే ఏడాది అక్టోబర్ నెలలో ఒక్కొక్కరికి ఎకరా చొప్పున 22 ఎకరాలను పంపిణీ చేయడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆర్‌సీబీ నంబర్ 729/1986 ఫైల్ ద్వారా పట్టాలను తయారు చేసి లబ్ధిదారులకు అందజేశారు. అయితే వీరికి పట్టాలను మంజూరు చేసి అధికారులు కొన్ని రోజుల తరువాత బదిలీపై వెళ్లడంతో తరువాత వచ్చిన అధికారులు పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేయలేదు. తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని పలు మార్లు అర్జీలు సమర్పించినా కొన్నేళ్లుగా ఏ అధికారి కూడా పట్టించుకోలేదు. దీంతో చేసేదేమిలేకా 22 మంది దళితులు తమకు మంజూరు చేసిన పట్టాలు ప్రకారం కేటాయించిన భూమిలో విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకొని 25 ఏళ్లగా పలు రకాల పంటలు సాగుచేసి భూ హక్కుదారులుగా ఉన్నారు.

మంత్రి స్వామి చెప్పాడని దండోరా...

దళితులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిపై స్థానిక టీడీపీ నేతల కన్ను పడింది. ఎలాగైనా దళితులు సాగుచేసుకుంటున్న భూమిలోకి వారిని వెళ్లనియ్యకుండా ఇబ్బందులకు గురి చేయాలని పన్నాగం పన్నారు. తరువాత ఈ భూములను కొట్టేయడానికి పథకం రచించి మంత్రి స్వామి ద్వారాగా ఇటీవల స్థానిక రెవెన్యూ అధికారులకు చెప్పించారు. మంత్రి స్వామి చెప్పిందే తడవుగా అధికారులు సర్వే నంబర్-1 లోని ప్రభుత్వ భూమిలోకి ఎవరూ వెళ్లకూడదని, అలాగే పంటలు సాగు చేయవద్దని గ్రామంలో దండోరా వేయించారు. అధికారుల మాటను ధిక్కరించి పంటలు సాగుచేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో కంగుతిన్న దళితులు తమకు మందస్తు నోటీసులు ఇవ్వకుండా టీడీపీ నాయకులు చెప్పారంటూ గ్రామంలో దండోరా వేయడం ఇదేమి చోద్యమంటూ రెవెన్యూ అధికారుల చర్యలపై విస్మయం వ్యక్తం చేశారు.

టీడీపీ కార్యకర్తలకు వర్తించవు...

25 ఏళ్ల క్రితం భూమి పంపిణీ చేసినా..ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎవరు కూడా దళితులకు పంపిణీ చేసిన భూముల జోలికి వెళ్లలేదు. కాని నేడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కావాలనే అధికారులను అడ్డుపెట్టుకొని గ్రామంలో దండోరా వేయించారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తమ భూముల్లో ఎలాంటి పంటలు సాగు చేయలేదని దళితులు వాపోతున్నారు. అయితే ఇదే సర్వే నంబర్-1లో టీడీపీ సానుభూతి పరులు ముగ్గురు ఒక్కొక్కరు రెండు ఎకరాలకు పైగా గ్రామ నత్తం భూమిని ఎనిమిది ఎకరాలను ఆక్రమించుకొని ఎలాంటి పట్టాలు లేకుండా ప్రస్తుతం సాగు చేస్తున్నారు. ఇటువంటి క్రమంలో పట్టా పత్రాలు ఉన్న వారిని భూముల్లోకి వెళ్ల వద్దని దండోరా వేయించిన రెవెన్యూ అధికారులు టీడీపీ సానుభూతిపరులు యథేచ్ఛగా గ్రామ నత్తం భూమిని ఆక్రమించుకొని సాగు చేస్తుంటే ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకపోవడం కొసమెరుపు.

తహసీల్దార్‌ను వివరణ కోరగా....

దళితుల భూములు విషయంలో తహసీల్దార్ పుల్లారావును వివరణ కోరగా గతంలో గ్రామంలోని కొంత మంది లబ్ధిదారులకు భూమి పంపిణీ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. అయితే వారికి తాత్కాలికంగా డీ పట్టాలు మాదిరిగా పత్రం అందజేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయకపోవడం వలన భూములు సాగు చేయవద్దని చెప్పాం . దీనిపై మరోసారి లబ్ధిదారులను విచారించి తగు న్యాయం చేస్తాం.

మా భూములను కాజేయాలని చూస్తున్నారు

అసైన్‌మెంట్ కమిటీ ద్వారా తమకు 1991లో భూమిని కేటాయించి పట్టా పత్రాలను పంపిణీ చేశారు. 25 ఏళ్లగా భూ హక్కుదారులుగా ఉండి ఏటా పలు రకాల పంటలను సాగు చేస్తున్నాం. కానీ టీడీపీ నాయకులు చెప్పారంటూ రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూమిలోకి వెళ్లవద్దంటూ గ్రామంలో దండోరా వేయించడం దారుణం. అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ నాయకులు మా భూములను కాజేయాలని చూస్తున్నారు.

– తుమ్మా రామకోటయ్య, ఎస్సీ కాలనీ, ఉప్పలదిన్నె

పట్టాలు ఉన్నా సాగు చేయనియ్యడం లేదు

గ్రామంలోని టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులను అడ్డుపెట్టుకొని మా భూముల్లోకి మమ్మల్ని పోనివ్వడం లేదు. పట్టా పత్రాలు ఉన్నా అధికారులు పట్టించుకోకుండా మంత్రి స్వామి చెప్పాడంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదే సర్వే నంబర్‌లో ఎలాంటి పట్టాలు లేకుండా టీడీపీ కార్యకర్తలు ముగ్గురు ఎనిమిది ఎకరాలు చొప్పున ఆక్రమించుకోని సాగు చేస్తున్నారు. వారిపై మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇదేమి న్యాయం దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

– పూరిమిట్ల కొండలరావు, ఎస్సీ కాలనీ, ఉప్పలదిన్నె



ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిని సాగు చేసి, విద్యుత్ మోటారు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

20 మందిపై బైండోవర్ కేసులు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని మాగుటూరులో మద్యం బెల్ట్‌షాపు నిర్వహణ కోసం నిర్వహించిన బహిరంగ వేలంపాటపై ఎస్సై సుదర్శన్‌యాదవ్ స్పందించారు. బుధవారం సాక్షిలో 'బెల్టు దేవుడి పాట..రూ.7.10 లక్షలు' అనే కథనానికి స్పందించారు. వేలంపాటలో పాల్గొన్న 20 మందిని అదుపులోనికి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపరచారు. రూ.5 లక్షల పూచికత్తుపై తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నోటీసులు జారీ చేసి విడుదల చేశారు. అర్ధవీడు మండలంలో ఎవరైనా అక్రమ కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సాగర్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య



పిల్లలతో మృతుడు రఫీ

దర్శి: చీటీ పాటల విషయంలో భార్యతో గొడవపడి దర్శిలోని సాగర్ కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..వినుకొండ పట్టణానికి చెందిన షేక్ రఫీకి దర్శికి చెందిన సాదియాతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రఫీకి తెలియకుండా భార్య సాదియా చీటిపాటలు నిర్వహిస్తుంది. ఈ క్రమంలో దర్శికి చెందిన బాజీ అనే వ్యక్తి నాలుగు చీటీ పాటలు వేసి డబ్బులు చెల్లించకుండా తిప్పుకుంటున్నాడు. ఈ విషయం భర్తకు తెలిసి కొంత కాలం నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం రఫి తన భార్యకు వీడియోకాల్ చేసి సాగర్ కాలువలోని దూకుతున్నానని చెప్పి చెప్పులు, సెల్‌ఫోన్ గట్టుపై పెట్టి కాలువలో దూకాడు. భార్య వెంటనే సంఘటనా ప్రాంతానికి వచ్చింది. అయితే కాలువలో మృతదేహం మాత్రం కనిపించలేదు. కాలువ ఒడ్డునే చెప్పులు, సెల్‌ఫోన్ ఉన్నాయి.

ఆర్‌ఓ బ్రిడ్జి ప్రదేశం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

టంగుటూరు: మండలంలోని టంగుటూరు రైల్వే క్రాసింగ్ 194 నంబర్ వద్ద నిర్మించనున్న నూతన ఆర్వో బ్రిడ్జి ప్రదేశాన్ని, రైల్వే క్రాసింగ్ 193 వద్ద సబ్‌వే నిర్మించేందుకు ప్రతిపాదిత ప్రదేశాన్ని బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, రహదారులు, భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతిపాదన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, ప్రతిపాదనలను త్వరగా పంపించాలని ఆదేశించారు. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ దేవానందం, ఈఈ గోపినాయక్, ఏఈ నాగార్జున, తహసిల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

కొండపి: స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-14 చెస్ పోటీలకు మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఈ.అభినాష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.సూసన్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ రవికిరణ్‌కుమార్ మాట్లాడుతూ అండర్ 14 బాలుర విభాగంలో ఎంపికైన ఈ.అభినాష్ రాష్ట్రస్థాయి చెస్ పోటీలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సూసన్నకుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడు రవికిరణ్ కుమార్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

కంభం: ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను బుధవారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..స్థానిక చొక్‌సెంటర్ సమీపంలోని చక్కాచలమయ్య సందులోని ఓ గృహంలో వ్యాపారి రాచమడుగు ప్రహల్లాద్‌కు చెందిన సుమారు రూ.లక్ష విలువైన దీపావళి టపాసులు నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకున్న సీఐ మల్లికార్జున సిబ్బందితో వెళ్లి తనిఖీ చేసి స్వాధీనం చేసకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కురిచేడు: పెద్దమొత్తంలో బాణసంచా నిల్వలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం శివ తెలిపారు. కురిచేడులో కృష్ణారెడ్డి అనే వ్యక్తి బాణసంచా నిల్వ చేసినట్లు సమాచారంతో దాడులు చేశామన్నారు. దాడిలో రూ.2.70 లక్షల విలువైన దీపావళి బాణసంచాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు రెండు పూరిల్లు దగ్ధం



ప్రమాదవశాత్తు కాలిపోయిన పూరి గుడిసెలు



ఎక్కడ ఉండాలని విలపిస్తున్న వెంకాయమ్మ, చంటిబిడ్డతో ఆమె కూతురు

మద్దిపూడి: ప్రమాదవశాత్తు రెండు పూరి గుడెసెలు దగ్ధమైన ఘటన మండలంలోని పొట్టిరెడ్డిపాలెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు మేరకు.. మద్దిపూడి పంచాయతీ పరిధిలోని పొట్టిరెడ్డి పాలెం గ్రామ శివారులో యానాదుల సామాజిక వర్గానికి చెందిన 5 కుటుంబీకులు పూరిగుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. వీరు పొలాలకు కాపలా కాయడం, కూలీ పనులకు వెళ్లడం జీవనభృతి. బుధవారం చౌటూరి వెంకయమ్మ కుమార్తె బిడ్డకు అనారోగ్యంగా ఉండటంతో మందుల కోసం కూతురును తీసుకుని మద్దిపూడి వెళ్లింది. ఇంటి పొయ్యిలో ఉన్న రవ్వలు లేచి గుడిసెకు అంటుకోవడంతో వెంకయమ్మ గుడిసెకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. ఆ మంటలు పక్కనే ఉన్న బాపట్ల కిషోర్ గుడిసెకు అంటుకొని మంటలు వ్యాపించాయి. విషయం గమనించిన సమీప రైతులు మంటలు పక్క గుడిసెలకు వ్యాపించకుండా అదుపు చేశారు. ప్రమాదంలో రెండు గుడిసెలు పూర్తిగా కాలిపోయాయి. మద్దిపూడి నుంచి వచ్చిన కుటుంబసభ్యులు బోరున విలపించారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న బీరువా, దుస్తులు, మంచాలు, వెండీ పట్టీలు, రూ.20 వేల నగదు అగ్నికి ఆహుతైనట్లు బాధితులు వెంకాయమ్మ, కిశోర్‌లు వాపోయారు. ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఏరోజుకారోజు కూలి పని చేసుకుని జీవించే మాకు నిలువ నీడ లేకుండా పోయిందని వారు బోరున విలపించారు.

యువకుల మధ్య ఘర్షణ



ఘర్షణలో గాయపడిన యువకుడు

పెద్దదోర్నాల: యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. ఘర్షణలో వై.చర్లోపల్లి గ్రామానికి చెందిన రమేష్ తల, కడుపుపై గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తేలాల్సి ఉంది.

రైలుగేటును ఢీకొన్న వాహనం

- ట్రాఫిక్‌కు అంతరాయం



ఒంగిపోయిన రాచర్లరోడ్డులోని రైల్వే గేటు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల రైల్వే గేటును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..బుధవారం మధ్యాహ్నం రైలు వచ్చే సమయంలో రాచర్ల గేటు వేశారు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం గేటును ఢీ కొట్టడంతో గేటు పూర్తిగా ఒంగిపోయింది. దీంతో రైల్వే సిగ్నల్ డిపార్టుమెంట్ వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఆ గేటుకు బదులు ప్రత్యామ్నాయంగా మరో గేటును ఏర్పాటు చేసి మరమ్మతులు చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి ప్రజలు ఇబ్బంది పడ్డారు. గుర్తుతెలియని వాహనం రైలు గేటును ఢీకొట్టిన విషయమై ఆర్పీఎఫ్‌కు సమాచారం అందించారు.

క్షేత్రస్థాయిలో మెరుగైన పశు వైద్యసేవలు

కొనకనమిట్ల: పశు పోషకులకు ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో మెరుగైన పశు వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని పశుసంవర్ధ శాఖ జేడీ బేబీరాణి పేర్కొన్నారు. మండలంలోని గార్లదిన్నెలో చేపట్టిన పశుగ్రాస క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. పశుపోషకులకు అవసరమైన గడ్డి జొన్నలను అందజేస్తామన్నారు. పశువుల పెంపకం, వ్యాధులు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. గొట్లగట్టు పశు వైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి, పశు సహాయకులు పాల్గొన్నారు.

పోటీలకు వెళ్లకుండా ప్రిన్సిపాల్ మోకాలడ్డు



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

- ప్రిన్సిపాల్ తీరుతో క్రీడాకారుల నిరాశ

ముండ్లమూరు(దర్శి): విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే అంటూ నిత్యం పాఠశాలల్లో ఉపన్యాసాలిస్తుంటారు. కానీ వాస్తవంలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే ముండ్లమూరులోని మోడల్ స్కూల్ క్రీడాకారులు పంగులూరులో జరుగుతున్న జిల్లాస్థాయి గేమ్స్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కానీ పాఠశాల ప్రిన్సిపాల్ మాత్రం వారు పోటీలకు వెళ్లేందుకు అనుమతించలేదు. చివరకు విద్యార్థులు తల్లిదండ్రులను తీసుకువచ్చి మాట్లాడించినా ప్రిన్సిపాల్ ఒప్పుకోలేదు. దీంతో పది మంది విద్యార్థులు నిరాశకు లోనయ్యారు. ఈ క్రీడాకారులు ఇటీవల జరిగిన నియోజకవర్గస్థాయి క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారుల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన పేరం ఐశ్వర్య అనే క్రీడాకారిణి కూడా ఉన్నారు. ఎన్నిసార్లు మొత్తుకున్నా ప్రిన్సిపాల్ పోటీలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో విద్యార్థులు నిరాశగా వెనుదిరిగారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా..విద్యార్థులను క్రీడలకు పంపాలని డీఈఓ నుంచి గానీ ఎంఈఓ నుంచి గానీ ఎటువంటి ఉత్తర్వులు లేవని చెప్పారు. పంగులూరులో జరుగుతున్న ప్రాక్టీస్ పోటీలని, జిల్లాస్థాయి పోటీలకు కాదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఒంగోలు టౌన్: నగరం నడిబొడ్డున ఉన్న బిలాల్ నగర్‌లో చెట్ల మధ్య ఒక గుర్తు తెలియని మృతదేహం అనుమానాస్పదస్థితిలో కనిపించడం కలకలం సృష్టించింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వీఆర్‌ఓకు సమాచారం ఇచ్చారు. మృతుడు నలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని, వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఆత్మహత్య చేసుకొని మరణించాడా లేక ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా అనేది తెలియాల్సి ఉంది. ఇస్లాంపేట ఇన్‌చార్జి వీఆర్‌ఓ దేవరకొండ వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఏదైనా సమాచారం తెలిసినవారు 9121102127, 9121104779 నంబర్లకు తెలియజేయాలని సీఐ కె.అజయ్‌కుమార్ తెలిపారు.



గుర్తు తెలియని మృతదేహం